# 99. అజ్ జిల్‌జాల్ (భూకంపం) సూరా

## పరిచయం

ఈ సూరా మదీనా కాలానికి చెందినది. ఇందులో 8 ఆయతులు ఉన్నాయి. తీర్పుదినం గురించి ఈ సూరా ముఖ్యంగా బోధించింది. ఈ సూరాలో ప్రస్తావనకు వచ్చిన 'జిల్‌జాల్' (భూకంపం) అన్న పదాన్ని దీనికి పేరుగా పెట్టడం జరిగింది. తీర్పుదినం నాటి భయానక స్థితిని, ఆనాటి ప్రకంపనాలను ఈ సూరా వర్ణించింది. ఆ రోజు భూమి తీవ్రంగా కుదిపివేయ బడుతుంది. భూగర్భంలో ఉన్న సమస్తాన్ని వెళ్ళ గ్రక్కుతుంది. అంటే మృతులను బయటకు వెళ్ళగ్రక్కుతుంది. ప్రజలు ఆ రోజు తమ కర్మలను చూసుకునేందుకు భిన్న పరిస్థితుల్లో తమ ప్రభువు వైపునకు మరలుతారు. శిక్షా లేదా బహుమానాలు పొందుతారు.

## 99. అజ్ జిల్‌జాల్[1] సూరా

## سُوْرَةُ الزَّلْزَالِ

అవతరణ :మదీనా ఆయతులు : 8

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

**1** భూమి చాలా తీవ్రమైన తన ప్రకంపనలతో కంపింపజేయబడినప్పుడు,[2]

اِذَا زُلْزِلَتِ الْاَرْضُ زِلْزَالَهَا ۝١

**2** మరి భూమి తన బరువులన్నింటినీ తీసి బయటపడవేసినప్పుడు,[3]

وَاَخْرَجَتِ الْاَرْضُ اَثْقَالَهَا ۝٢

**3** "అరె! దీనికేమైపోయిందీ?" అని మనిషి (కలవరపడుతూ) అంటాడు.[4]

وَقَالَ الْاِنْسَانُ مَا لَهَا ۝٣

**4** ఆ రోజు భూమి తన సంగతులన్నీ వివరిస్తుంది.[5]

يَوْمَئِذٍ تُحَدِّثُ اَخْبَارَهَا ۝٤

1. ఈ సూరా మక్కాలో అవతరించిందా? లేక మదీనాలో అవతరించిందా? అన్న విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. ఈ సూరా మహత్తుకు సంబంధించి కూడా ఎన్నో ఉల్లేఖనాలు ఉన్నాయి. కాని అవి ప్రామాణికమైనవి కావు.

2. అంటే – ఆ తీవ్ర ప్రకంపనలకు భూమి అంతా దద్దరిల్లుతుంది. దానిపై ఉన్న పెద్ద వస్తువులు, నిర్మాణాలన్నీ కుప్పకూలిపోతాయి. తొలిసారి శంఖం పూరించబడినప్పుడు ఈ ప్రళయం సంభవిస్తుంది.

3. భూమిలో ఖననం చేయబడిన వారంతా భూమిలోని భారమే. ఈ భారాన్ని ప్రళయ దినాన భూమి బయటపడవేస్తుంది. అంటే, దైవాజ్ఞ కాగానే భూమిలో ఉన్నవారంతా సజీవులై బయటికివస్తారు. భూమిలో నిక్షిప్తమైవున్న ఇతర నిధులు కూడా ఆ రోజు బయటపడతాయి. రెండవసారి శంఖం ఊదబడినప్పుడు ఇది జరుగుతుంది.

4. ఆ క్షణంలో మనిషికి ఏమీ పాలుపోదు. అతను తీవ్రంగా ఆందోళన చెందుతూ, "ఈ భూమికి ఏమైపోయిందీ? ఇదెందుకిలా ఊగిపోతోంది? ఇందులోని వస్తువులు ఎందుకలా బయటపడుతున్నాయి?" అని అంటాడు.

5. హదీసు ప్రకారం ఒకసారి దైవప్రవక్త (సఅసం) ఈ ఆయతును పఠించి, "ఇంతకీ భూమి సంగతులేమిటో మీకు తెలుసా?" అని అడిగారు. "దైవానికి, దైవప్రవక్తకే బాగా తెలుసు" అని ప్రియసహచరులు చెప్పారు. అప్పుడాయన (స) "ఏ దాసుడు,

**5** ఎందుకంటే నీ ప్రభువు దానికి, ఆ మేరకు ఆజ్ఞాపించి ఉంటాడు.[6]

بِاَنَّ رَبَّكَ اَوْحٰى لَهَا ۝٥

**6** ఆ రోజు జనులు – వారి కర్మలు వారికి చూపబడేందుకుగాను[7] – వేర్వేరు బృందాలుగా తరలివస్తారు.[8]

يَوْمَئِذٍ يَّصْدُرُ النَّاسُ اَشْتَاتًا ۙ لِّيُرَوْا اَعْمَالَهُمْ ۝٦

**7** కనుక ఎవడు అణుమాత్రం సత్కార్యం చేసినా దాన్ని అతను చూసుకుంటాడు.[9]

فَمَنْ يَّعْمَلْ مِثْقَالَ ذَرَّةٍ خَيْرًا يَّرَهٗ ۝٧

ఏ దాసురాలు భూమి వీపుపై ఏ ఏ కార్యాలు చేశారో వాటిని గురించి అది సాక్ష్యమిస్తుంది. ఫలానా వ్యక్తి ఫలానా పని చేశాడని, ఫలానా రోజున ఈ విధంగా చేశాడని భూమి పూసగుచ్చినట్లు చెబుతుంది." (తిర్మిజీ–ప్రళయదిన వివరణకు సంబంధించిన అధ్యాయాలు, జిల్‌జాల్ సూరా వ్యాఖ్యానం; ముస్నదె అహ్మద్–2/374).

6. అంటే – భూమికి ఈ మాట్లాడేశక్తిని అల్లాహ్ ప్రసాదిస్తాడు. అందువల్ల ఈ విషయంపై ఆశ్చర్యచకితులు కానవసరం లేదు. ఎందుకంటే ఆనాడు మనిషి శరీరావయవాలకు మాట్లాడేశక్తిని ఇచ్చినట్లే దేవుడు నేలకు కూడా తన గోడును వినిపించుకునే శక్తిని ఇస్తాడు. అప్పుడది తన ప్రభువు ఆజ్ఞను పురస్కరించుకుని మాట్లాడుతుంది.

7. మనుషులందరికీ–వారి కర్మలు వారికి ఎలాగూ చూపబడతాయి. వారు గనక ఒకవేళ కాదు, కూడదు అంటే వారికి వ్యతిరేకంగా వారి శరీరావయవాలు సాక్ష్యమిస్తాయి. వారు సంచరించిన భూమి సయితం జరిగింది జరిగినట్లుగా చెబుతుంది.

8. అంటే – వారు సమాధుల నుండి లేచి లెక్కలు తేల్చబడే స్థలానికి వస్తారు లేదా లెక్కలు తేల్చబడిన తరువాత తమ గమ్యస్థానమైన స్వర్గానికిగానీ, నరకానికిగానీ తిరిగి వెళతారు. అప్పుడు వారు జట్లు జట్లుగా విడిపోతారు. వారిలో కొన్ని గుంపులు నిశ్చింతగా ఉంటే మరికొన్ని గుంపులు ఆందోళనకు గురై ఉంటాయి. కొందరి ముఖాలు దేదీప్యమానంగా ఉంటాయి. వారు స్వర్గవాసులై ఉంటారు. మరికొందరి ముఖాలపై నలుపు ఆవరించి ఉంటుంది. వారు నరకానికి ఆహుతి కానున్నారనటానికి అదొక చిహ్నం. కొందరు కుడి వైపు సాగిపోతుంటే, మరికొందరు ఎడమవైపు పోతుంటారు. ఆయా ప్రజల అభిమతాలను, కర్మలనుబట్టి వేర్వేరు గుంపులుగా విభజించటం జరుగుతుంది.

9. దాన్ని చూసుకుని అతను అమితంగా సంతోషిస్తాడు.

| | |
|---|---|
| **8** మరెవడు అణుమాత్రం దుష్కార్యం చేసినా దాన్ని అతను చూసుకుంటాడు.[10] | وَمَنْ يَّعْمَلْ مِثْقَالَ ذَرَّةٍ شَرًّا يَّرَهٗ ﴿٨﴾ |

10. దాన్ని చూసుకుని అతను సిగ్గుతో కుంచించుకుపోతాడు. తనకు పట్టబోయే దుర్గతిని తలచుకుని కలవరం చెందుతాడు. **'జర్రతిన్'** ( ذَرَّةٍ ) అంటే అణుమాత్రం, రేణువు లేక రవ్వంత అనే అర్థాలు వస్తాయి. అది చీమకన్నా చిన్నదిగా ఉండేది అని కొందరు భావించగా, మనిషి మట్టిపై చేయిని కొట్టినప్పుడు అతని చేతికి అంటేది రేణువు అని మరికొంతమంది విద్వాంసులు అభిప్రాయపడ్డారు. ఏదైనా రంధ్రంలో నుంచి సూర్యకిరణాలు ప్రసరిస్తున్నప్పుడు ఆ వెలుగులో తేలియాడుతున్నట్లు కనిపించే దుమ్ము ధూళి నలకలే రేణువులని ఇంకా కొందరు భావిస్తున్నారు. ఇమామ్ షౌకానీగారైతే ఈ మూడింటిలో మొదటి అభిప్రాయమే సరైనదని అన్నారు. ఇమామ్ ముఖాతిల్ ఇలా అంటున్నారు : "ఇద్దరు వ్యక్తుల గురించి ఈ వాక్యాలు అవతరించాయి. వారిలో ఒకడు : యాచకునికి అత్యంత అల్పమైన దానం చేయటానికి కూడా వెనుకాడడు. మరొకడు చిన్నపాటి పాపం చేయటానికి కూడా భయపడడు." (ఫత్‌హుల్ ఖదీర్).